# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత స్థూల దేశీయోత్పత్తి 7.8 శాతం వృద్ధి నమోదు కావడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు**

2. **ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు అక్టోబర్ నాటికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

4. **రాష్ట్రంలో నవోదయ విద్యాలయాలతో పాటు రెండు ఎయిమ్స్ సంస్థలను ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.**

==========================

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత స్థూల దేశీయోత్పత్తి – జీడీపీ 7.8 శాతం వృద్ధి నమోదు కావడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజల సంకల్ప బలం, సమష్టి కృషితోనే ఈ వృద్ధి సాధ్యమైందని పేర్కొంటూ ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో సందేశాన్ని ఈరోజు ఆయన పంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులతో సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ భారత్ వేగంగా ఆర్థిక అభివృద్ధి సాధిస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధి నమోదు కావడం దేశ ఆర్థిక బలానికి,సమిష్టి సంకల్పానికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈరోజు స్పందిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 నుంచి దేశంలో ఆర్థిక బలోపేతం, డిజిటల్ పరివర్తన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్వావలంబన దిశగా కీలక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. యువతను ఆవిష్కరణలు, వ్యవస్థాపకత వైపు ప్రోత్సహిస్తూ భారత్‌ను బలమైన, స్వయం సమృద్ధిగల, భవిష్యత్తుకు సిద్ధమైన దేశంగా తీర్చిదిద్దుతున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

--------------------------

ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పొన్నపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి నగదు పంపిణీ చేశారు. అనంతరం మొగల్తూరులో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ...

..వాయిస్.. 30 సెకన్లు

---

తూర్పు గోదావరి జిల్లాలోని అనపర్తి రైల్వే స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ కు రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె ఈరోజు స్పందిస్తూ, హాల్టింగ్ సౌకర్యంతో అనపర్తి నుంచి విశాఖపట్నం, హైదరాబాద్, అమరావతి, విజయవాడ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందని చెప్పారు.విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులకు ఈ రైలు హాల్టింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

---

రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం 28 రకాల సామాజిక పింఛన్లు అందిస్తోందని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా రణస్థలం మండలం కొచ్చర్ల, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను ఆయన ఈరోజు పంపిణీ చేశారు. ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా 61 లక్షల 92 వేల మందికి పైగా లబ్ధిదారులకు 2 వేల 693 కోట్ల 90 లక్షల రూపాయల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు.

అలాగే తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు అక్టోబర్ నాటికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడిస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---

రాష్ట్రంలో నవోదయ విద్యాలయాలు లేని 13 జిల్లాల్లో కొత్త జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో మరో రెండు అఖిల భారత వైద్య, విజ్ఞాన సంస్థ – ఎయిమ్స్ సంస్థల ఏర్పాటుకు సహాయం అందించాలని రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రికి ఈరోజు వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నవోదయ విద్యాలయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, రాయలసీమతో పాటు గిరిజన ప్రాంతాల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో రెండు ఎయిమ్స్ సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. వీటి ద్వారా అత్యున్నత వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన మరింత అందుబాటులోకి వస్తాయని లింగమనేని రమేశ్ తెలిపారు.

---

కేంద్ర ప్రభుత్వ సంస్థ హడ్కో ఆర్థిక సహాయంతో నెల్లూరు నగరంలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకం పనులను త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో 28 లక్షల రూపాయలతో నిర్మించిన కచ్చా రోడ్డును మంత్రి ఈరోజు ప్రారంభించారు. అలాగే కోటి 20 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన రెండు పారిశుద్ధ్య వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏలూరును నిలిపేలా కృషి చేస్తున్నామని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ, కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, వాటి వల్ల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు.ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల సమాచారం కోసం హెల్ప్‌లైన్ 14446, ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఎస్.ఐ.ఆర్ పురోగతిపై ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం–6 దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని, ఫారం–7 దరఖాస్తులపై కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 3న తుది ముసాయిదా ప్రచురించే వరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి కనీసం 50 శాతానికి పైగా పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్– ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో జరగనున్నాయి. ఈ రోజు సాయంత్రం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఈ క్రీడా పోటీలను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని వివిధ పోలీసు రేంజ్‌లు, యూనిట్ల నుంచి సుమారు 1,900 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. విట్ ఏపీ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికలుగా ఈ నెల నాలుగో తేదీ వరకు పోలీస్ క్రీడా పోటీలు కొనసాగనున్నాయని అధికారులు తెలిపారు.

=====================